క్లుప్తంగా

ప్రత్యేక అలంకరణలో కన్యకాపరమేశ్వరి దేవి



కొల్లూరు: ఆషాడ మాసం సందర్భంగా కొల్లూరులోని శ్రీ వాసవి కన్యకాపర మేశ్వరి అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కరివేపాకుతో చేపట్టిన గిరి నింబ పత్రాంబరి దేవిగా అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కార్యవర్గ సభ్యులు తాడేపల్లి కృష్ణబాబు, పబ్బిశెట్టి సత్యకుమారు, లక్ష్మీప్రసాద్ పర్యవేక్షణలో అర్చకులు శివశర్మ పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

నేడు చెరుకుపల్లిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

చెరుకుపల్లి: చెరుకుపల్లి పంచాయతీ సచివాలయం-1 పరిధిలో బుధవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ పైనం ఏడుకొండలురెడ్డి మంగళవారం ఒక ప్రకటలో తెలిపారు. ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరిస్తారని పేర్కొన్నారు.

నేడు పెసర్లంకలో..

భట్టిప్రోలు: పెదలంక సచివాలయం పరిధిలోని పెసర్లంక గ్రామంలో బుధవారం సాయంత్రం 4 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున పాల్గొంటారని పేర్కొన్నారు.

రేపల్లె ఎంఈఓ-2 బాధ్యతల స్వీకరణ



రేపల్లె రూరల్: మండల విద్యాశాఖ అధికారి-2గా కేసనశెట్టి సురేష్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. పర్చూరు మండలం వీరన్నపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఆయన ఎంఈఓ-2గా పదోన్నతి పొందారు. ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘ నాయకులు స్వాగతం పలికారు.

నోటు పుస్తకాల పంపిణీ



రేపల్లె: పట్టణంలోని 27వ వార్డు ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో నిజాంపట్నంకు చెందిన అబ్దుల్ తాజ్‌ముల్లా తన తండ్రి అబ్దుల్ రహీం జ్ఞాపకార్థం మంగళవారం విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన పేరెంట్స్ కమిటీ సమావేశంలో కౌన్సిలర్ కరీమున్నీసా పాల్గొని, మాట్లాడారు. నాలుగేళ్లగా తాజ్‌ముల్లా పుస్తకాలు అందించటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం నాజరున్నీసా, ఉపాధ్యాయులు సుమలత, నాగమణి, తల్లి దండ్రులు పాల్గొన్నారు.

కౌలు కార్డులపై అవగాహన

కర్లపాలెం: కర్లపాలెం గ్రామ సచివాలయంలో మంగళవారం కౌలు రైతులకు సాగు ధృవీకరణ పత్రాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఏఈవో భాగ్యలక్ష్మి మాట్లాడుతూ కౌలు రైతులు పండించే పంటలు విక్రయించేందుకు, నష్టపరిహారం పొందేందుకు సాగు ధృవీకరణ పత్రాలు ఉపయోగపడుతాయని తెలిపారు. ఈ వీఆర్వో కె.చంద్రశేఖర్ వీఏఏ భ్రమరాంభాదేవి పాల్గొన్నారు.

నేడు బండ్లమ్మ ఆలయ కానుకల హుండీ లెక్కింపు

పిట్టలవానిపాలెం: చందోలు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ బగళాముఖి అమ్మవారి దేవాలయంలో భక్తులు అమ్మవారికి సమర్పించిన కానుకల హుండీని బుధవారం లెక్కించనున్నట్లు ఆలయ ఈఓ జి.నరసింహమూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు బాపట్ల దేవాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో లెక్కింపు జరుగుతుందని తెలిపారు.

మట్టి ఖర్చులకు నగదు సాయం



అమృతలూరు(భట్టిప్రోలు): అమృతలూరు మండలం మూల్పూరుకు చెందిన బందెల సుజాత అనే మహిళ అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న గ్రేస్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కైతేపల్లి షాలేమ్‌రాజు ఫౌండేషన్ ప్రచార కమిటీ కన్వీనర్ యన్నం సురేష్ ద్వారా మృతురాలి కుటుంబానికి రూ.10 వేలు మట్టి ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందజేశారు. ఫౌండేషన్ యూత్ అధ్యక్షుడు పి.అనిల్, సభ్యులు కూచిపూడి వినయ్, సురేష్, గ్రామ పెద్దలు సీతయ్య ఉన్నారు.

అవినీతి రహిత పాలనే సీఎం వైఎస్ జగన్ లక్ష్యం

ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు



నిజాంపట్నంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు

నిజాంపట్నం: అవినీతి రహిత పాలనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు పేర్కొన్నారు. మంగళవారం నిజాంపట్నం పంచాయతీ పరిధిలోని కోసూరివారిపాలెం, మరకావారిపాలెం, ఫిషర్‌మెన్ కాలనీల్లో రెండవ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరించారు. ఈ సందర్భంగా ఎంపీ మోపిదేవి మాట్లాడుతూ ఎలాంటి అవినీతికి తావులేకుండా నేరుగా లబ్ధిదారుని ఖాతాలో సంక్షేమ పథకాల నగదును జమచేసి, అవినీతి రహిత పాలనను సీఎం వైఎస్ జగన్ అందిస్తున్నారని తెలిపారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న సీఎం జగనన్నకు అండగా నిలవాలని కోరారు. టీడీపీ నాయకులు చెప్పే కల్లబొల్లి మాటలు నమ్మి మోసపోవద్దని హెచ్చరించారు. స్థానికంగా నెలకొన్న పలు సమస్యలను ఎంపీ మోపిదేవి దృష్టికి స్థానికులు తీసుకురావడంతో సమస్యల పరిష్కారానికి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మోపిదేవి విజయనిర్మల, వైఎస్సార్ సీపీ నాయకులు మోపిదేవి హరనాథబాబు, జెడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, మాజీ జెడ్పీటీసీ ప్రసాదం వాసుదేవ, యార్లగడ్డ మదన్ మోహన్, ఎంపీటీసీ నాజర్ ఖాన్, పలు శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో కుటుంబాలు అభివృద్ధి

'గడప గడపకు మన ప్రభుత్వం'లో మంత్రి మేరుగ నాగార్జున



మహిళకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

పెదగాదెలవర్రు(వేమూరు): సంక్షేమ పథకాలతో పేద కుటుంబాల అభివృద్ధి జరుగుతోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. చుండూరు మండలంలోని పెద గాదెలవర్రు గ్రామంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలు అమలును తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి నాగార్జున మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు వల్ల ప్రతి కుటుంబం అభివృద్ధి చెందినట్లు తెలిపారు. గత ప్రభుత్వం సంక్షేమ పథకాలను విస్మరించిందని ఆరోపించారు. సంక్షేమ పథకాలపై విమర్శలు చేసిన ప్రతిపక్షం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టి, అమలు చేస్తున్న నవరత్నాల పథకాలనే.. తమ మేనిఫెస్టోలో ప్రకటించిందన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కె.రమాదేవి, ఎంపీపీ జాలాది రూబేను, పార్టీ మండలాధ్యక్షుడు గాదె శివరామ కృష్ణారెడ్డి, గ్రామ సర్పంచ్‌లు వుయ్యూరి అప్పిరెడ్డి, సుబ్బారెడ్డి, రాయల సురేష్, శ్రీనివాసరావు, బాబీ, మల్పూరు సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువ చేసేందుకే 'జగనన్న సురక్ష'



చందోలులో కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ సువార్త, ఎంపీడీఓ శేషమాంబ



ఈపూరులో పర్యవేక్షిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు



బుద్ధాంలో సర్వేను పరిశీలించిన డీపీఓ రాంబాబు

డీఎల్‌డీఓ సువార్త

పిట్టలవానిపాలెం: సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేసేందుకే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బాపట్ల డీఎల్‌డీఓ చంద్ర సువార్త అన్నారు. మండలంలోని చందోలు, పిట్టలవానిపాలెం గ్రామాల్లో నిర్వహిస్తున్న జగనన్న సురక్ష సర్వే కార్యక్రమాన్ని ఎంపీడీఓ భవనం మారుతీ శేషమాంబతో కలిసి మంగళవారం పరిశీలించారు. ప్రతి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి వివరాలు నమోదు చేసుకుని టోకెన్ నంబరు ఇవ్వాలని తెలిపారు. జులై 1 నుంచి పిట్టలవానిపాలెం, భవనంవారిపాలెం గ్రామాల్లో, జులై 4న చందోలు గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కె.పద్మజ, చందోలు సర్పంచ్ గౌరీదేవి విజయకుమారి, మునీర్, గ్రామ కార్యదర్శులు శేషగిరిరావు, శ్రీనివాసరావు, వీఆర్వోలు అరుణకుమారి, నాగజ్యోతి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఉన్నారు.

జగనన్న సురక్ష సర్వే పరిశీలన

కొల్లూరు : ఈపూరు గ్రామంలో జరుగుతున్న జగనన్న సురక్ష సర్వేను తహసీల్దార్ ఎ. శ్రీనివాసరావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక సచివాలయంలో వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రతి వలంటీరు తమ పరిధిలోని గృహానికి వెళ్లి, సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తించి, వారికి అవసరమైన ధృవీకరణ పత్రాలు అందించి, వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈపూరు లంకలో జరుగుతున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఎంపీడీఓ ఐ.సత్యనారాయణరావు పరిశీలించారు.

అర్హులను గుర్తించేందుకు జగనన్న 'సురక్ష సర్వే'

బుద్ధాం(కర్లపాలెం): ప్రభుత్వ సంక్షేమ పథకాల మంజూరుకు అర్హులను గుర్తించేందుకు జగనన్న సురక్ష సర్వే దోహదపడుతుందని డీపీఓ దాసరి రాంబాబు పేర్కొన్నారు. మంగళవారం బుద్ధాం గ్రామంలో జరుగుతున్న జగనన్న సురక్ష సర్వేను ఆయన పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష సర్వేను సక్రమంగా చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఎ.ఎలీషాబాబు, కార్యదర్శి డి.పద్మావతి, ఎంపీటీసీ సభ్యులు జి.కమలమ్మ, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

నీరు మళ్లించి..రోడ్డుకు మోక్షం కల్పించి



ప్రొక్లెయినర్‌తో వర్షపు నీటి మళ్లింపు పనులు

కొల్లూరు: వర్షాలకు మడుగును తలపించేలా మారిన రోడ్డుకు ఆర్అండ్‌బీ అధికారులు మోక్షం కల్పించారు. పెసర్లంకలో రహదారిపై నీరు నిలిచి పది గ్రామాలకు చెందిన ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. నిలిచిన వర్షాపు నీరు మళ్లించేందుకు అవకాశం లేకపోవడంతో.. సమస్య జఠిలమయ్యింది. సమస్య ఆర్అండ్‌బీ అధికారుల దృష్టికి వెళ్లడంతో రోడ్డు అంచున మెరకలను ప్రొక్లెయినర్‌తో తొలగించి, వర్షపు నీరు బయటకు వెళ్లేందుకు మార్గం సుగమం చేశారు. ఆర్అండ్‌బీ డీఈ లక్ష్మీనారాయణ, ఏఈ నరసింహారావు పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ, మంత్రి మేరుగ నాగార్జున సూచనలు, ఉన్నతాధికారుల ఆదేశాలతో నీరు నిలుస్తున్న ప్రాంతంలో సీసీ రోడ్డు నిర్మాణానికి అంచనాలు రూపొందిస్తున్నట్లు తెలిపారు.

మద్యం మత్తులో మహిళపై దాడి

వేమూరు: మద్యం మత్తులో ఇద్దరు వ్యక్తులు మహిళపై దాడి చేసిన ఘటన జంపని గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. జంపని గ్రామానికి చెందిన మూల్పూరు రమేష్, అల్లూరు భారతికి వివాహేతర సంబంధం ఉంది. ఇద్దరి మధ్య మనస్పర్థలు చోటుచేసుకోవడంతో..భారతి రమేష్‌ను దూరం పెట్టింది. భారతి తనతో మాట్లాడటం లేదని రమేష్ కక్ష పెంచుకున్నాడు. ఈ క్రమంలో గత శనివారం రాత్రి భారతి జంపని చెరువు సెంటర్‌లో పండ్ల వ్యాపారం ముగించుకుని ఇంటికి వెళ్తున్న క్రమంలో రమేష్ ఆమెను అడ్డుకొన్నాడు. దుర్భాషలాడాడు. అనంతరం ఆలపాటి ధనంజయ్య అనే వ్యక్తిని తీసుకొచ్చి, ఇద్దరు కర్రలతో ఆమెను కొట్టారని ఎస్ఐ నాగరాజు తెలిపారు. తీవ్రంగా గాయపడిన భారతి తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్య శాలలో చికిత్స పొందుతోంది. తెనాలి త్రీ టౌన్ పోలీసులకు దాడిపై ఫిర్యాదు చేయడంతో.. ఆ సమాచారం మేరకు స్థానిక పోలీసు స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదు చేసి, విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

● జగనన్న 'తోడు'గా.. జీవితం చల్లగా



మజ్జిగ విక్రయిస్తున్న నరసింహారావు



ఒకప్పుడు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేసిన.. ఈ పెద్దాయన ఇప్పుడు దానినే జీవనోపాధిగా మలుచుకున్నారు. బాపట్ల బస్టాండ్ సెంటర్‌లో ఏడాది మొత్తం చల్లని మజ్జిగ అమ్ముతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక.. తన చిరు వ్యాపారానికి ఒక 'తోడు' లభించిందని, సంక్షేమ పథకాల లబ్ధితో తన జీవితం మరింత 'చల్లగా' ఉందంటూ..సంతోషంగా ప్రజలకు మజ్జిగ పంపిణీ చేస్తున్నారు.. 60ఏళ్ల వయసు మీద పడిన ముద్రబోయిన నరసింహారావు. మెడలో ఒక ఐడెంటిటీ కార్డు వేసుకున్న ఆయన.. ఇది ఏంటని ఎవరైనా అడిగితే.. 'ఇది జగన్ బాబు తోడయ్యా.. గతంలో మజ్జిగ నీళ్లు అమ్మిన డబ్బులతోనే ఇల్లు గడిచేది. జగన్ బాబు సీఎం అయ్యాక మా కుటుంబానికి చాలా మేలు చేశాడయ్యా.. మా ఇంటావిడకు చేయూత పథకం ద్వారా రూ.18,500 ఇచ్చాడు. పిల్లాడి చదువులకు ఆయనే పైసలు వేస్తున్నాడు. ఇక నాకు నాలుగేళ్లగా ఏటా జగనన్న తోడు పథకం ద్వారా రూ.10 వేలు ఇస్తున్నాడు. ఇదిగో ఈ వ్యాపారం బాగా చేసుకోవాలని బ్యాంకులో రూ.50 వేలు రుణం కూడా ఇప్పించాడయ్యా.. అందుకే ఈ కార్డు ఎప్పుడూ నా మెడలోనే ఉంటది. ఇది నా దగ్గర ఉంటే ఆ జగన్ బాబు తోడు ఉన్నాడనే ధైర్యంగా ఉంటుంది.' అంటూ సమాధానం ఇస్తున్నాడు. 36ఏళ్లుగా తాను చల్లని మజ్జిగ అందిస్తున్నట్లు చెప్పుకొచ్చిన ఆయన.. 'ఆ జగన్ బాబు చల్లగా ఉంటే చాలయ్యా.. మనందరం కూడా చల్లగా ఉంటాం'. అంటున్నారు.

-బాపట్ల అర్బన్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చుండూరు(భట్టిప్రోలు): చుండూరు మండలంలోని మున్నంగివారిపాలెం, నడిగడ్డవారిపాలెం ఎస్సీ కాలనీ, వలివేరులో బుధవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ట్రాన్స్ కో ఏఈ అర్జునరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల్లో విద్యుత్ మరమ్మతులు నిర్వహిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఆయన పేర్కొన్నారు.

వలివేరులో..

వలివేరు(వేమూరు): వలివేరు గ్రామంలో బుధవారం ఉదయం 7 గంటల నుంచి 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ అర్జునరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వలివేరు గ్రామంలో మరమ్మతులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థులు చక్కగా చదువుకోవాలి: ఎంఈఓ నిరంజన్



బాపట్ల: విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత స్థితికి చేరుకోవాలని ఎంఈఓ నిరంజన్ పేర్కొన్నారు. చెరువుజమ్ముల పాలెంలోని జేసీ ఎస్ఎంఎం సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాలు, సామగ్రిని మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు కన్నెగంటి జాన్‌వెస్లీ, ప్రధానోపాధ్యాయులు ఎం.ప్రకాశ వర్ధిని, ఉపాధ్యాయురాలు జోగి శ్యామసుందరి, ఆయా కీర్తన పాల్గొన్నారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలి

రేపల్లె రూరల్: ఉమ్మడి గుంటూరు జిల్లాలోని నాయీబ్రాహ్మణ విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఠాగూర్ నాయీ బ్రాహ్మణ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో నగదు ప్రోత్సాహక బహుమతులు అందించటం జరుగుతుందని సొసైటీ నాయకుడు యడ్లపల్లి కిషోర్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంజినీరింగ్, ఎంసెట్, నీట్‌లలో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గోల్డ్ మెడల్ బహూకరించనున్నామని, 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. జులై 31 లోపు ధృవీకరణ పత్రాల నకళ్లతో గుంటూరు, ఆదిత్య నగర్ 1వలైన్, రెడ్డిపాలెంలోని ఠాగూర్ నాయీ బ్రాహ్మణ ఎడ్యుకేషన్ సొసైటీకి దరఖాస్తులు పంపాలని పేర్కొన్నారు.

సర్టిఫికెట్ల మిస్సింగ్‌పై ఫిర్యాదు

భట్టిప్రోలు: రైలులో తన సర్టిఫికెట్ల ఫైల్‌ని మరచిపోవడంతో మంగళవారం రేపల్లె రైల్వే స్టేషన్ పీఎస్‌లో ఓ యువతి ఫిర్యాదు చేసింది. కాచిగూడ నుంచి రేపల్లె డెల్టా ఫాస్ట్ ప్యాసింజర్ రైలులో వెల్లటూరుకు చెందిన గోవతోటి సునీత తన సర్టిఫికెట్ల ఫైల్‌ను మరచిపోయింది. దీంతో రేపల్లె రైల్వే పీఎస్‌ను ఆశ్రయించింది. జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ దాసరి వేణు మంగాధరరావు సీసీ పుటేజ్‌ను పరిశీలించారు. ఈ పుటేజ్‌లో ట్రెయిన్‌లో తన ఎదురుగా ప్రయాణిస్తున్న వ్యక్తి చేతిలో ఫైల్ ఉండడాన్ని గుర్తించారు.

తెనాలిలో జగన్నాథస్వామి రథయాత్ర



తెనాలిఅర్బన్: తెనాలి నాజరుపేటలోని ఇస్కాన్ మందిరం వారి ఆధ్వర్యంలో శ్రీ జగన్నాథ స్వామి రథయాత్ర మంగళవారం ఎంతో వైభవంగా జరిగింది. శివాజీ చౌక్ వద్ద నుంచి సాయంత్రం ప్రారంభమైన రథయాత్ర పట్టణ వీధుల గుండా శోభాయమానంగా సాగింది. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొబ్బరికాయ కొట్టి రథయాత్రను ప్రారంభించారు. ఇస్కాన్ అధ్యక్షుడు సింహ గౌరదాస్ ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. మహిళలు, భక్తులు రథయాత్రలో పాల్గొన్నారు. వివిధ దేశాల నుంచి వచ్చిన కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు, కోలాట నృత్యాల మధ్య స్వామి వారి రథయాత్ర ఆద్యంతం ఘనంగా జరిగింది. గాంధీచౌక్ మీదుగా నెహ్రూరోడ్, ప్రకాశంరోడ్, గంగానమ్మపేట, మెయిన్‌రోడ్, బోస్‌రోడ్ గుండా రథయాత్ర సాగుతూ శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానం వద్దకు చేరుకుంది.

వీటిని పరిశీలించాకే.. విత్తనాలు కొనుగోలు చేయాలి

విత్తన దుకాణాల్లో ఏడీఏ అక్తర్ హుస్సేన్ తనిఖీలు



చెరుకుపల్లిలోని దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏడీఏ అక్తర్ హుస్సేన్, ఏఓ బాలాజీ గంగాధర్

చెరుకుపల్లి: వరి విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తప్పకుండా సంచిపై గడువు తేదీని రైతులు పరిశీలించాలని రేపల్లె ఏడీఏ అక్తర్ హుస్సేన్ సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో విత్తన దుకాణాలను మంగళవారం ఏఓ బాలాజీ గంగాధర్‌తో కలసి ఆయన తనిఖీ చేశారు. విత్తన సంచిపై ల్యాబ్ నంబరు, గడువు తేదీ చూసుకోవాలని, 8 నెలలు గడిస్తే మొలక శాతం తగ్గుతుందని ఏడీఏ తెలిపారు. విత్తనాలు కొన్న తర్వాత దుకాణాల్లో బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలని, ముందుగానే మొలక శాతం పరీక్షించాలని స్పష్టం చేశారు. 15 శాతం తేమ, 80 శాతం మొలక ఉండాలని సూచించారు. దుకాణదారులు కూడా అమ్మకానికి తెచ్చిన విత్తనాలను సోర్స్ ఆఫ్ సప్లై సర్టిఫికేట్‌ను సంబధిత కంపెనీ నుంచి గానీ, పంపిణీదారుడి నుంచి పొందాలని చెప్పారు. దుకాణం పేరు, డోరు నంబరు, లైసెన్సు నంబరు, విత్తన రకాల నిల్వలు ధరల పట్టికను సూచించే బోర్డు దుకాణంలో ప్రదర్శించాలని స్పష్టం చేశారు. అనంతరం దుకాణాల్లో రికార్డులను పరిశీలించారు.

మధుమేహ వ్యాధిపై అవగాహన తప్పనిసరి



షుగర్ నియంత్రణపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ దినేష్‌కుమార్

రేపల్లె: మధుమేహ వ్యాధిపైపై ప్రతి ఒక్కరిలో అవగాహన ఉండాలని డాక్టర్ వేముల దినేష్ కుమార్ తెలిపారు. ప్రపంచ మధుమేహ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రసాలయ కళా సమితి కార్యాలయంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. షుగర్ బారిన పడినవారు వైద్యుడి సలహా మేరకు చికిత్స పొందటం, మందులు తీసుకోవటం తప్పనిసరి అన్నారు. నిరంతరం వ్యాయామం, యోగా, ధ్యానం.. ఆహారంలో జాగ్రత్తలు పాటించటంతో షుగర్‌ను అదుపులో ఉంచవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కళా సమితి అధ్యక్షుడు మల్లెల రామచంద్రరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ కోడె గౌరీశంకర్, సభ్యులు యార్లగడ్డ బుచ్చిరావు, మేకా రామకృష్ణ, కె.నటరాజ్, మేకా మృత్యుంజయరావు, కొల్లూరు వాసు, కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు సీఎం వైఎస్ జగన్ కృషి



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ వేణుగోపాల్‌రెడ్డి

కర్లపాలెం: కర్లపాలెం పంచాయతీ ఎంవీరాజు పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు పిట్ల వేణుగోపాల్ రెడ్డి పాల్గొని, మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు సీఎం వైఎస్ జగన్ కృషి చేస్తున్నారని తెలిపారు. హెచ్ఎం విజయ భాస్కరరెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను అన్ని విధాల ప్రోత్సహించాలని చెప్పారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రూ.30లక్షలతో పాఠశాల అభివృద్ధి

పిట్టలవానిపాలెం: పిట్టువారిపాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం తల్లిదండ్రుల కమిటీ సమావేశం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు పరిశ నరసింహారెడ్డి మాట్లాడుతూ.. నాడు

■ నేడు కార్యక్రమం ద్వారా రూ.30 లక్షలతో పాఠశాలను అభివృద్ధి చేసుకున్నామని గుర్తుచేశారు. మధ్యాహ్న భోజనం చేసేందుకు నూతన భవనానికి రూ.3.50లక్షలు, ఫర్నీచర్ కొనుగోలుకు రూ.7 వేలు మంజూరైనట్లు తెలిపారు. ఈ సమావేశంలో పాఠశాల తల్లిందండ్రుల కమిటీ చైర్మన్ తుమ్మ నాంచారమ్మ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ముస్లిం ఐక్యవేదిక నియోజకవర్గ అధ్యక్షుడిగా ముజీబ్



నిజాంపట్నం: ముస్లిం ఐక్య వేదిక రేపల్లె నియోజకవర్గ అధ్యక్షుడిగా ముజీబ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం నిజాంపట్నంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లా అధ్యక్షుడు మౌలా బేగ్ తనకు నియామక పత్రాన్ని అందించినట్లు తెలిపారు. ముస్లిం సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు. సమావేశంలో ఎంపీటీసీ నాజర్‌ఖాన్, పలువురు ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలి



ప్రతినిధులతో మాట్లాడుతున్న డీఎస్పీ

బాపట్లటౌన్: విద్యార్థుల కదలికలపై పాఠశాల, కళాశాలల యజమాన్యాలు ఎప్పటికప్పుడు దృష్టి సారించాలని డీఎస్పీ టి.వెంకటేశులు సూచించారు. బాపట్ల డీఎస్పీ కార్యాలయంలో మంగళవారం పట్టణంలోని పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలకు విద్యార్థుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వారికి వివరించారు. మాదక ద్రవ్యాల నివారణకు ప్రతి ఒక్కరి కృషి ఎంతో అవసరమన్నారు. ముఖ్యంగా కళాశాలలో ర్యాగింగ్ భూతాన్ని తరిమివేయాలని చెప్పారు. ర్యాగింగ్‌తో భవిష్యత్తు నాశనం చేసుకోవడంతో పాటు జైలుపాలు అవుతారనే విషయాన్ని అధ్యాపకులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో వివరించాలని సూచించారు. పాఠశాల, కళాశాలల్లో బ్యాడ్ టచ్, గుడ్ టచ్‌పై విద్యార్థినులకు అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. ఎక్కడైనా మాదక ద్రవ్యాలు సేవించే విద్యార్థులుంటే వారి వివరాలను పోలీసులకు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ కృష్ణయ్య, ట్రాఫిక్ ఎస్ఐ సుధాకర్ పాల్గొన్నారు.